## క్లుప్తంగా

### అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మీదేవి

**కంచరపాలెం:** గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో అధిక శ్రావణ మాసం శుక్ల చతుర్థి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో పూజలు జరిగాయి. ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గాదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

**గోపాలపట్నం:** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహన చోదకుడికి కోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపిన వివరాలిలా.. ఇటీవల ఎన్ఏడీ బ్రిడ్జి వద్ద చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి గూడ్స్ వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌ను పట్టుకున్నారు. ఆ వ్యక్తికి మూడో స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఇన్‌చార్జి 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వై.గణపతిరావు రూ.10 వేలు జరిమానా విధించారు. కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు కేసులకు గాను మొత్తంగా రూ.31,000 జరిమానా వసూలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే తగిన మూల్యం చెల్లించక తప్పదని సీఐ అప్పారావు హెచ్చరించారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


ఈస్ట్ పార్క్ వద్ద రహదారి విస్తరణ పనులను పరిశీలిస్తున్న కె.కె.రాజు

**మద్దిపాలెం:** జీవీఎంసీ 51వ వార్డులో మాధవధార 48ఏ బస్‌స్టాప్ రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పరిశీలించారు. ఈస్ట్ పార్క్ నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు జరుగుతున్న విస్తరణ పనులపై అధికారులకు ఆయన తగు సూచనలిచ్చారు. కె.కె.రాజు వెంట పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, డైరెక్టర్ పైడి శ్రీను, 51వ వార్డు నాయకులు పైడి ప్రతాప్, శ్యామ్, వినోద్, గణేష్, ధర్మేంద్ర, డీఈ భరణి, ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ తదితరులు వెంట ఉన్నారు.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**దొండపర్తి:** సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించిన రోజునే మహిళా సాధికారత సాధ్యమని డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేరీ సుజాత కంటిపూడి పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌సీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా 'మహిళా సాధికారత, శిశు సంరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. లింగ సమానత్వాన్ని సాధించకుండా మహిళా సాధికారత సాధ్యపడదని చెప్పారు. ముఖ్యంగా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, మానసిక శ్రేయస్సుకు మహిళల్లో శారీరక సాధికారత కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రఫుల్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# 'జగనన్న సురక్ష'తో ఎంతో మేలు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 51వ వార్డులో లబ్ధిదారులకు 1,500 ధ్రువపత్రాల అందజేత


లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

**మద్దిపాలెం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన జగనన్న సురక్ష క్యాంప్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రజలందరికీ ఎంతగానో ఉపయోగపడుతోందని, పరిపాలనను ఇంటి వద్దకే తీసుకెళ్తోందన్నారు. అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు సీఎం వైఎస్ జగన్ ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి నివాసుల సమస్యలు నేరుగా తెలుసుకుని టోకెన్లు అందించారన్నారు. ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఈ సేవల ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.

**వలంటీర్ వ్యవస్థతో సమస్యల పరిష్కారం**

కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ 51వ వార్డులో లబ్ధిదారులకు 1,500 సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలు తీర్చడంలో విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ జయ, ఏపీడీ పద్మావతి, డీఈ భరణి, ఏఈ అర్చన, జేసీఎస్ మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, వార్డు సీనియర్ నాయకులు పైడి ప్రతాప్, రత్నం, లలిత, వై.వరలక్ష్మి, సోనీ, రాణి, శ్యామ్, ధర్మేంద్ర, ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### మూడు రోజుల్లోనే క్యాస్ట్ సర్టిఫికెట్



వాహన మిత్ర పథకం కోసం సచివాలయానికి వెళ్తే క్యాస్ట్ సర్టిఫికెట్ కచ్చితంగా ఉండాలన్నారు. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మూడు రోజుల్లోనే కుల ధ్రువపత్రం అందజేశారు.

– కొండబాబు, రామన్న కాలనీ

### పిల్లలకు కుల ధ్రువపత్రాలు అందజేశారు



మా పిల్లల కోసం గతంలో క్యాస్ట్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేశాం. మూడేళ్లయినా రాలేదు. వారం రోజుల ముందు వలంటీర్లు జగనన్న సురక్ష కోసం వివరించి చెప్పి దరఖాస్తు చేయించారు. నాలుగు రోజుల్లోనే ధ్రువపత్రాలు చేతికి అందించారు.

– పి.లక్ష్మి, భీంనగర్

## ప్రతి గడపలో సంతోషం


సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ

**మద్దిపాలెం:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రతి గడపలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 51వ వార్డు 288 సచివాలయం పరిధి మహత్ కాలనీ, రాజీవ్‌నగర్, సీతన్న గార్డెన్స్ ప్రాంతాల్లో శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాన్ని చేపట్టలేదన్నారు. గతంలో ప్రజలే ప్రజాప్రతినిధులు, అధికారుల వద్దకు వెళ్లి సమస్యలు చెప్పుకునేవారని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ఆ పరిస్థితి మారిందని చెప్పారు. ప్రజాప్రతినిధులే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, డైరెక్టర్ పైడి శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 51వ వార్డు నాయకులు రాజంరాజు, పప్పల లక్ష్మణ్, శ్యామ్, లత, రత్నం, రాణి, వై.వరలక్ష్మి, పి.అప్పారావు, మాస్టర్, మసీనమ్మ, జగన్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, పైడిరాజు, వినోద్, గణేష్, ధర్మేంద్ర, సీనియర్ నాయకులు కృష్ణారావు మాస్టర్, సాడి కేశవ్, షేక్ బాబ్జి, ఎం.సునీల్, సమ్మెట్ల వెంకటేష్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### వివేకానంద బోధనలు, జీవిత విశేషాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ మిషన్ స్వామి

**సీతమ్మధార:** వివేకానంద అడ్వకేట్ అసోసియేషన్ మెంబర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో స్వామి వివేకానంద బోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివేకానంద జీవిత విశేషాలు, ఆశయాలపై వారికి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ సెక్రటరీ స్వామి స్వాసం వేద్యానంద మాట్లాడుతూ విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రను విశదీకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పైడి గోవిందరావు, విద్యా శంకర్, హరిహరరెడ్డి, పి.రాజారావు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం నేడు



గోదాదేవి అమ్మవారు, వైభవ వేంకటేశ్వరస్వామి

**మురళీనగర్:** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో గోదాదేవి అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తిరునక్షత్ర మహోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఉదయం 5 గంటలకు శ్రీవారి సుప్రభాత సేవ అనంతరం 9 గంటలకు గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రదక్షిణ చేయిస్తారు. అనంతరం అమ్మవారికి అర్చన, తిరుప్పావై పారాయణం జరుపుతారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు గోదాదేవి దర్శనం, ప్రసాద వితరణ ఉంటుంది.

**వైభవుడికి నేడు సుప్రభాత సేవ**

వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

### అలరించిన వయోలిన్ కచేరి


కీర్తనలు వినిపిస్తున్న కోట గాయత్రి

**సీతంపేట:** అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో శుక్రవారం జరిగిన కర్ణాటక వయోలిన్ కచేరి ప్రేక్షకులను అలరించింది. సంగీత విద్వాంసుడు ఎం.ఎస్.ఎస్.మూర్తి శిష్యురాలు కోట గాయత్రి వరేణ్య వయోలిన్‌పై త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలు వినిపించారు. ప్రణమామ్యహం, నినువిన, ప్రక్కల నిలబడి, నారాయణతే కీర్తనలు అలరించాయి. ఈమెకు ఎం.కామేష్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## దేవస్థానం దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలువ్యాపారాలు నిర్వహించుకోవడానికి శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి కొన్ని, మూడేళ్ల కాలపరిమితితో కొన్ని లీజు హక్కులు కల్పించారు. హెచ్చు మొత్తంలో పాడిన వారికి అధికారులు షాపులు ఖరారు చేశారు. సింహగిరిపై భక్తులకు ఫొటోలు తీసేందుకు ఏడాదికి రూ. 26.33 లక్షలు, కాఫీ,టీల విక్రయానికి రూ.42వేలకు ఖరారు చేశారు.

సింహాచలం గురువారం సంతలో ఆశీలు వసూలుకు రూ.96వేలు, గోపాలపట్నం బుధవారం సంత మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు లక్షా 43వేలు, కేశ ఖండనశాల వద్ద షాపు అద్దె నెలకు రూ.38వేలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లోని 68వ దుకాణానికి నెలకు రూ. 37వేలు, కొండదిగువ పురూరవ బిల్డింగ్‌లోని 29, 32 దుకాణాలకు నెలకు రూ.12,500 చొప్పున, పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడో నెంబర్ షాపునకు నెలకు రూ.10,400, ప్రహ్లాదపురంలోని షాపు నెంబర్ 8 నెలకు రూ.3 వేల అద్దెకు ఖరారు చేశారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఈవోలు రమేష్, జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్ అప్పారావు, ఉద్యోగులు దొంతల రమణ తదితరులు వేలం పాటలు నిర్వహించారు.

### కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### 'ఎకో వైజాగ్'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కళాకారులు

**కంచరపాలెం:** జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని సెబాస్టియన్ కాలనీ, బాబు కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్ఎస్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా నాట్యమండలి కళాకారులు తడి–పొడి చెత్త, ఎకో వైజాగ్, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకం స్థానికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు వార్డు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ అర్జున్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## అప్రమత్తతతోనే ఫ్లోరోసిస్ నివారణ

**మహారాణిపేట:** ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పారిశుద్ధ్య శాఖ విడుదల చేసిన సమాచారం ద్వారా రాష్ట్రంలో ఫ్లోరోసిస్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఫ్లోరోసిస్‌పై అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సమత, ఇతర వైద్యులు, ఎన్‌సీడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటైంది. చైర్మన్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కార్యదర్శిగా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ శివప్రసాద్, సభ్యులుగా విద్యా శాఖ ఏడీ జ్యోతి, పీవో సమత ఎన్నికయ్యారు.

## గరికిపాటి ప్రవచనాలు ప్రారంభం


ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభిస్తున్న గరికిపాటి నరసింహారావు

**సీతమ్మధార:** అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మనుచరిత్ర గురించి ప్రసంగించారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై ప్రవచించారు. శని, ఆదివారాల్లో సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనాల కార్యక్రమం జరుగుతుందని, భక్తులు, అభిమానులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ, కోశాధికారి కె.శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ పి.వి.కె.హనుమాన్‌రాజు, ఈసీ మెంబర్లు, విజయ నిర్మాన్ సంస్థ అధినేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జీఈఆర్, డ్రాపవుట్స్ చేరికల ప్రక్రియ వేగవంతం


మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

**సీతంపేట:** గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌ను త్వరగా పూర్తి చేయాలని, డ్రాపవుట్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అధికారులను జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ ఆదేశించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం జీఈఆర్, డ్రాపవుట్స్‌పై జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. ఈ విషయమై ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలు, ఎంఆర్‌పీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతమ్మధార మండల విద్యా శాఖ అధికారులు బాలమణి, డి.రామారావు, సమగ్ర శిక్షణా అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్లలో సబ్సిడీ టమాటా విక్రయాలు


సీతమ్మధార రైతుబజారులో రాయితీపై విక్రయిస్తున్న టమాటాలు


కంచరపాలెం రైతుబజారులో బారులు తీరిన వినియోగదారులు

**సీతమ్మధార:** రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు కిలో టమాటా రాయితీపై రూ.50కే విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం సీతమ్మధార రైతుబజారుకు 60 కేట్ల టమాటా సరఫరా కావడంతో వినియోగదారులు భారీగా చేరుకున్నారు. రెండు కౌంటర్లలో సబ్సిడీ టమాటా విక్రయించారు. రైతుబజారు ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

**కూలిన గోడ..**

సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం ఉదయం రాయితీపై టమాటా విక్రయిస్తున్న సమయంలో ఒక్కసారిగా అక్కడి గోడ కూలిపోయింది. రైతులు, ఈవో, సహాయకులు వెంటనే స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వినియోగదారులు ఒక్కసారిగా గోడపై పడటంతో అది కూలింది.

**కంచరపాలెం రైతుబజారులో బారులు**

**కంచరపాలెం:** కంచరపాలెం రైతుబజారులో సబ్సిడీ టమాటా కోసం వినియోగదారులు గంటల సమయం బారులు తీరుతున్నారు. ఇక్కడ టమాటా విక్రయాలకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే క్యూ లైన్లు కడుతున్న వినియోగదారులు కంచరపాలెం బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలోకి బారులు తీరారు. గంటల పాటు వేచి ఉన్న వినియోగదారులకు ఒక కిలో మాత్రమే టమాటా ఇవ్వడంతో ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు, ఉద్యోగాలకు వెళ్లే సమయమంతా టమాటాల కోసం నిరీక్షించాల్సి వచ్చిందని వాపోయారు. సుమారు 13 క్వింటాళ్ల టమాటాలు విక్రయించినట్లు రైతుబజారు ఈవో కృష్ణమోహన్ తెలిపారు. వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విక్రయించామన్నారు. మార్కెటింగ్ అధికారులు కంచరపాలెం రైతుబజారులో సబ్సిడీ టమాటా విక్రయాలను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

## రహదారుల అనుసంధానానికి చర్యలు


రోడ్డు కనెక్టవిటీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవింద్, డాక్టర్ జగదీశ్వరరావు, ఏసీపీ శాస్త్రి

**సీతంపేట:** జీవీఎంసీ 25వ వార్డు రెల్లి వీధి బీటీ రోడ్డును బుల్లయ్య కళాశాల రహదారికి అనుసంధానించేందుకు శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ రోడ్ కనెక్టవిటీ విషయమై గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, కలెక్టర్ ఎ.మల్లికార్జునల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వారి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి షబ్నన్, టీపీఎస్ అనిత, కార్పొరేటర్ గోవింద్‌తో కలిసి రహదారిని పరిశీలించారు. ప్లానింగ్ సెక్రటరీ హేమ, ఏఎన్ఎం రమణి, వార్డు యూత్ ప్రెసిడెంట్ సన్నీం వార్డు కన్వీనర్ బొమ్మాళి రవి, గుడివాడ గౌరినాయుడు, ఆశా వర్కర్ సంధ్య పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

**సీతమ్మధార:** మణిపూర్ మహిళలపై హింసకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మహిళా చేతన, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఐద్వా, పీవోడబ్ల్యు సంస్థల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై హింస, అత్యాచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థినులను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలకు తెగబడటం, కుకీ మహిళల మీద దాడులు చేసి రెండు వేల మంది సమక్షంలో వివస్త్రలను చేసి, సామూహికంగా అత్యాచారం చేయటం దారుణమన్నారు. నిందితులను తక్షణం శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ ఫోరంకు చెందిన వీఎస్ కృష్ణ, ఎం.లక్ష్మి, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, ఎస్ఎన్‌రాజు, సంతోష్, ఎల్.జె.నాయుడు, గౌతమ్, శ్రావణ విమలకుమారి, శాంతి, రమణి, అప్పలరాజు, వరలక్ష్మి, అప్పారావు, పలు మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వాల్తేర్ డివిజన్‌లో 'అనూప్' మార్క్

డివిజనల్ రైల్వే మేనేజర్‌గా విశేష సేవలు


అనూప్‌కుమార్ సత్పతి (పూర్వ డీఆర్ఎం)

**తాటిచెట్లపాలెం:** ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్‌గా ఇప్పటి వరకు పనిచేసిన అనూప్‌కుమార్ సత్పతి ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. తనదైన శైలిలో విధులు నిర్వహించి ఒక ప్రత్యేక వ్యక్తిగా ఆయన నిలిచారు. ఎందరో డీఆర్‌ఎంలు చేయలేని, తీసుకోలేని కొన్ని సాహసోపేత నిర్ణయాలను ఈయన తీసుకుని డివిజన్‌లో అధిక శాతం ఉద్యోగులు, నాయకులతో శభాష్ అనిపించుకున్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా ఎటువంటి స్థాన చలనం లేకుండా విధులు నిర్వర్తిస్తూ డివిజన్‌ను వారి కనుసన్నల్లో నడిపించిన వారిని ట్రాన్స్‌ఫర్ చేయించి సఫలీకృతులయ్యారని, ఇటువంటి విషయాల్లో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అనూప్‌కుమార్ సత్పతి మాత్రం తగ్గలేదని సిబ్బంది తెలియజేశారు. రైల్వే క్వార్టర్స్, స్థలాలు, ఆస్తులను కాపాడటంలో కీలకంగా వ్యవహరించారు. రైల్వే క్వార్టర్స్, కార్యాలయాలు, వివిధ విభాగాలు, పలు సెక్షన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసేవారు. ఇటీవల జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన సమయంలో కూడా వాల్తేర్ డివిజన్ నుంచి పలువురు అధికారులు, సిబ్బందితో కలిసి సుమారు 48 గంటల పాటు ప్రమాద స్థలంలో చేపట్టిన పునరుద్ధరణ చర్యల్లో అనూప్‌కుమార్ సత్పతి పాల్గొన్నారు. వాల్తేర్ డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముఖ్యంగా విశాఖ రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు అదనంగా(9, 10) మరో రెండు ప్లాట్‌ఫారాల ఏర్పాటు విషయంలో ఈయన చాలా ఒత్తిడి చేసినట్లు తెలిసిందే. ఎన్నో ఏళ్లుగా సాధ్యం కాని అండర్ బ్రిడ్జిని గోపాలపట్నంలో సాధించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో సుమారు 75 కిలోమీటర్లు డబ్లింగ్ పనులు 2022–23లో పూర్తి చేశారు. భారతీయ రైల్వేలోనే లోడింగ్‌లో వాల్తేర్ డివిజన్‌ను నంబర్ వన్ స్థానంలో నిలిపి, నూతన రికార్డులు నెలకొల్పారు.